



కోవెలకుంట్ల: బిజనవేముల సమీపంలో మొక్కజొన్నలో చేరిన వర్షపునీరు, సంజామల వద్ద తేమశాతం అధికమై ఎర్రబారిన మొక్కజొన్న పైరు, అమడాల సమీపంలో నీరు అధికంగా చేరడంతో దెబ్బతిన్న పైరు

వెంటాడుతున్న వర్షాలు

- సంజామలలో 19.8 మి.మీ వర్షపాతం
- అధిక వర్షాలతో దెబ్బతింటున్న పైర్లు
- ఆందోళన చెందుతున్న రైతులు

కోవెలకుంట్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో స్థానిక వ్యవసాయ సబ్‌డివిజన్‌లో నాలుగు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం సబ్ డివిజన్‌లోని సంజామల మండలంలో అత్యధికంగా 19.8 మి.మీ., ఉయ్యాలవాడ మండలంలో 18 మి.మీ., దొర్నిపాడు మండలంలో 16.8 మి.మీ., కోవెలకుంట్ల మండలంలో 15.4 మి.మీ., కొలిమిగుండ్ల మండలంలో 8.6 మి.మీ., అవుకు మండలంలో 7.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పంట పొలాల్లో భారీగా వర్షపునీరు చేరింది. మొక్కజొన్న, మినుము, పెసర తదితర పంటల్లో నీరు నిల్వ చేరి నీటికుట్టుతో మొక్కలు చనిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- సంజామల: రైతన్న ఆశలు వర్షార్పణమయ్యాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నెల వరకు వర్షాల కోసం ఎదురు చూశారు. అయితే కొన్ని రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు భూమిలో తేమ శాతం ఎక్కువగా పైర్లు ఎర్రబారిపోతున్నాయి. మండలంలో వరి 500 ఎకరాలు,మొక్కజొన్న 3,650 ఎకరాలు, మినుము 450 ఎకరాలు, కంది,134 ఎకరాలు, ఇతర పంటలు 280 ఎకరాల్లో సాగు చేశారు.



సొదరదిన్నె సమీపంలో చెరువును తలపిస్తున్న పంట పొలం

క్లుప్తంగా

శ్రీరామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు



రామలింగేశ్వరుడు

డోన్ టౌన్: శ్రావణ మాసం చివరి సోమవారం పురస్కరించుకొని పట్టణంలోని శ్రీసాంబశివాలయం, ఇందిరా నగర్, వైఎస్ నగర్, పాతపేట, నగరేశ్వరస్వామి ఆలయం ఇతర శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే ఈశ్వరునికి అభిషేకాలు, అర్చనలు, మంగళ హారతులు తదితర ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాద వితరణలు చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ సమీపంలోని పాతబుగ్గలో కొలువైన శ్రీ పాత బుగ్గరామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు అలంకరణ చేశారు. ఆలయ ధర్మకర్త బైసాని రాజు ఆధ్వర్యంలో భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ముచ్చట్ల మల్లికార్జునుడికి పూజలు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్.కొట్టాల గ్రామ సమీపాన వెలసిన శైవ పుణ్యక్షేత్రమైన ముచ్చట్ల భ్రమరాంబ, మల్లికార్జునస్వామి ఆలయంలో శ్రావణ మాసం సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామివారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, ప్రత్యేక పుష్పాలంకరణలో మహా మంగళహారతి నిర్వహించారు. ఆలయ సందర్శనకు వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి



నూతన కార్యవర్గ సభ్యులతో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

బేతంచెర్ల: రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీ రైతు సంఘం నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో ఏపీ రైతు సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షుడిగా కిష్టన్న, అధ్యక్ష, కార్యదర్శులుగా సుబ్బరాయుడు, రామ మోహన్, ఉపాధ్యక్షులు రాంబాబు, శేషిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మరి కొంత మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

నేతాజీ సేవలు చిరస్మరణీయం



నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాస్ చంద్రబోస్ సేవలు చిరస్మరణీయం అని డోన్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మద్దయ్య, సామాజిక కార్యకర్త మమ్మద్ రఫీ అన్నారు. ఆయన అదృశ్యం అయిన రోజు సందర్భంగా సోమవారం స్థానిక కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో బోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య పోరాటాంలో ఆయన చూపిన ధైర్య సాహసాలను వివరించారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. న్యాయవాదులు రాగుల రాముడు, హరిమురళీధర్‌రావు, నరసింహులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో అన్నదానం



అన్నదానం చేస్తున్న వైద్యురాలు

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాతలు బండికాటి లక్ష్మీ ప్రసన్న, చంద్రశేఖర్ రెడ్డి దంపతుల సహకారంతో రోగులు, గర్భిణులకు అన్నదానం చేశారు. సమాజ సేవ కార్యక్రమాలతో పాటు రోగులకు అన్నదానం చేయడం అభినందనీయమని లయన్స్ క్లబ్ సభ్యుల సేవలను పలువురు కొనియాడారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డి, రాజు, సభ్యులు వలిబాషా, మనోహర్ రెడ్డి, వన్నూర్ బాషా, రామకృష్ణ, జయకృష్ణ పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి

సంజామల: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ రమణయ్య సూచించారు. మండల కేంద్రంలో సోమవారం రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు బైక్‌పై హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ మాట్లడుతూ హెల్మెట్ ధరించడం వల్ల ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగితే తలకు బలమైన గాయాలు తలగకుండా రక్షణగా ఉంటుందన్నారు.రోడ్డు నియమాలు పాటించకుంటే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసుల్లో జరిమానాల మోత

డోన్ టౌన్: డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన నలుగురు నిందితులకు భారీగా జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సోమవారం తీర్పునిచ్చారు. పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా తెలిపిన వివరాల మేరకు.. పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో డ్రంకెన్ డ్రైవ్ చేస్తూ నలుగురు వ్యక్తులు పట్టుబడగా సోమవారం డోన్ కోర్టులో హాజరుపరిచారు. జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ అనీల్‌కుమార్ కేసును పరిశీలించి నిందితులు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో నెల రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు సీఐ వెల్లడించారు. ఇకపై డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు రోజూ చేపడతామని స్పష్టం చేశారు.

పరామర్శ

కొలిమిగుండ్ల: మండలంలోని కోటపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త శ్రీనును సోమవారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పరామర్శించారు. అనారోగ్యం కారణంగా శ్రీను కూడి కాలును ఇటీవల తొలగించారు.ఆసుపత్రి నుంచి ఇంటికి రావడంతో విషయం తెలుసుకున్న కాటసాని గ్రామానికి చేరుకొని ఆరోగ్య స్థితిగతులను శ్రీను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు మూల ఈశ్వర్‌రెడ్డి ఉప సర్పంచ్ నాగిరెడ్డి ఉన్నారు.

చీకటి జీఓను రద్దు చేయాలి



జీఓ కాపీలతో నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌ఎస్‌యూ నాయకులు

కోవెలకుంట్ల: వివిధ విద్యార్థి సంఘాలు వసతి గృహాల్లోకి వెళ్లడానికి అనుమతి లేదని ఇచ్చిన చీకటి జీఓను రద్దు చేయాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగ మండల అధ్యక్షుడు గున్నాల శేష జశ్వంత్‌రెడ్డి అన్నారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో స్థానిక జమ్మలమడుగు చౌరస్తాలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జీఓ కాపీలతో నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ పలు విద్యార్థి, రాజకీయ పార్టీలకు చెందిన విద్యార్థి సంఘాలకు హాస్టళ్లను సందర్శించేందుకు వీలు లేదని జీఓ విడుదల చేయడం అప్రజాస్వామికమన్నారు. హాస్టల్‌లో ఉంటూ విద్యనభ్యసించే విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతుందా, అన్ని రకాల వసతులు అందుబాటులో ఉన్నాయా లేదా అనే విషయాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. జీఓ రద్దు చేయకపోతే దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల మండల అధ్యక్షులు రాంభూపాల్‌రెడ్డి, ధనికొండ నాగేశ్వరరెడ్డి, విద్యార్థి సంఘం నాయకులు సమీర్, జనార్దన్‌రెడ్డి, చాంద్ పాల్గొన్నారు.

ఘనంగా కాటసాని రామిరెడ్డి జన్మదిన వేడుకలు



రామిరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు అభిమానులు



శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు

బనగానపల్లె: మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి 59వ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా జరిగాయి. స్థానిక స్వగృహంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి బొకే అందజేసి సన్మానించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి రామిరెడ్డి కేక్ కట్ చేసి వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ తన జీవితం ప్రజాసేవకే అంకితమన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటానని చెప్పారు. నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండి సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం మండల అధ్యక్షులు పాపిరెడ్డి సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో 108 కొబ్బరి కాయలు పగలగొట్టి అభిమానాన్ని చాటుకున్నారు. నంద్యాలలోనున్న అంధుల పాఠశాలలో సంజామల మండల వైస్ ఎంపీపీ చిన్నబాబు ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. పార్టీ నాయకులు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, చిన్నబాబు, బీంరెడ్డి ప్రతాప్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, అబ్దుల్ ఖైర్, అబ్దుల్ ఫైజ్, సాదిక్, ఈశ్వర్ నాయక్, మోహన్‌బాబు పాపన్న, గడ్డం రామకృష్ణారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, అంబటి రవికుమార్‌రెడ్డి, సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రమణ, సుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి, సురేష్ రెడ్డి, సురేష్, మురళీ మోహన్‌రెడ్డి, రామన్న, అల్లిహుసేన్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాకు అంతరాయం

డోన్: మున్సిపల్ పరిధిలోని ప్రజలకు మంచినీటిని సరఫరా చేసే గాజులదిన్నె ప్రాజెక్టు ప్రధాన పైపులైన్ క్రిష్ణగిరి మండలం ఆగవేళి, సంగాల గ్రామాల మధ్య లీకేజీ ఏర్పడటం వల్ల ఈ నెల 19, 20వ తేదీల్లో 1, 2, 4, 12 నుంచి 32 వార్డులకు మంచినీటి సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే యు.కొత్తపల్లె నుంచి సోమయాజులపల్లె వరకు నిర్మిస్తున్న నేషనల్ హైవే రోడ్డు నిర్మాణ పనులలో భాగంగా స్థానిక బేతంచెర్ల రంగ ఫంక్షన్ హాల్ సమీపంలో ఫ్లైఓవర్ నిర్మిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా 250 ఎంఎం ఏసీ పైపులైన్‌ను డ్యామేజ్ చేయడం జరిగిందని, దీని మరమ్మతు పనులు జరుగుతున్నందువల్ల 3 నుంచి 10 వార్డులు, 17వ వార్డు ప్రజలకు ఈనెల 21, 22వ తేదీలలో మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన వివరించారు. మరమ్మతుల అనంతరం మంచినీటి సరఫరా యథావిధిగా కొనసాగుతుందన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితులకు నీరు కావాల్సిన వారు అమెనిటీ సెక్రటరీ గోవిందనాయక్ సెల్ నంబర్ 94905 73120 ను సంప్రదించాలని సూచించారు.

ఫ్లైఓవర్ పనులు ప్రారంభం



రైల్వే గేటు వద్ద చేపట్టిన ఫ్లైఓవర్ నిర్మాణ పనులు

బేతంచెర్ల: ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లె నుంచి బేతంచెర్ల మండలం మీదుగా డోన్ వరకు రూ.650 కోట్లతో 53 కిలోమీటర్ల మేర చేపట్టిన 340బీ జాతీయ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం రైల్వే గేటు వద్ద ఇరువైపులా కిలోమీటర్ మేర ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చేపట్టారు. పనులు ముగిసే వరకు వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయంగా రహదారిని మళ్లించి రైల్వే అండర్ బ్రిడ్జి కింద రాకపోకలు జరిగేలా చర్యలు తీసుకున్నారు. ఈ ఫ్లైఓవర్ పూర్తయితే రైల్వే గేటు వద్ద వాహనదారులకు వేచి ఉండాల్సిన ఇక్కట్లు తొలగనున్నాయి. ముఖ్యంగా ఇప్పటివరకు 53 కిలోమీటర్ల మేర రహదారిలో 44 కిలో మీటర్ల రహదారి పనులు పూర్తైనట్లు అధికారులు వెల్లడించారు. మిగతా 9 కిలోమీటర్ల రహదారి నిర్మాణ పనులను అటవీ శాఖ నుంచి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేష్‌బాబు

కొలిమిగుండ్ల: సంజామల నుంచి మీర్జాపురం మీదుగా రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ వరకు చేపట్టిన విద్యుత్ రైల్వే నిర్మాణానికి సంబంధించిన కాపర్ వైర్ ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ రమేష్ బాబు నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచారు. ఆయన మాట్లాడుతూ..జూలై 18–24వ తేదీ వరకు రాత్రి సమయంలో మీర్జాపురానికి చెందిన మోట్టే రామాంజనేయులు,రామచంద్రుడు, కళ్యాణ్‌కుమార్, వెంకటసుబ్బయ్య, వెంకటనరసింహా నాయుడు కలిసి విద్యుత్ లైన్ కాపర్‌వైర్ చోరీకి పాల్పడుతూ వచ్చారు. ఇలా మొత్తం రూ.7.76 లక్షలు విలువజేసే 420 మీటర్ల కాంటినరీ కాపర్, 306 కాంట్రాక్టు కాపర్‌వైర్‌ను చోరీ చేశారు. త్రిమూర్తి సంస్థ సూపర్‌వైజర్ వెంకటనాథ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులు మీర్జాపురం సరిహద్దులోని సుంకులమ్మ గుడి వద్ద ఉండగా వారి నుంచి రూ.2.10 లక్షల నగదు, కాపర్‌వైర్, రెండు కటర్లు, 15 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామని వివరించారు. కేసు దర్యాప్తు దశలో ఉందని, ఇంకా పలువురిని అదుపులోకి తీసుకోవాల్సి ఉందని చెప్పారు.

నేడు గణేష్ ఉత్సవ సమితి సమావేశం

బేతంచెర్ల: ఈ నెల 27 నుంచి జరుపుకునే వినాయక చవితి పండుగ సందర్భంగా గణేష్ ఉత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, ఎలక్ట్రికల్ శాఖల అధికారులతో నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఉత్సవ మండలి నుంచి కనీసం ఇద్దరు పాల్గొనాలని సూచించారు. విగ్రహాల ఏర్పాటు మొదలుకొని, ఊరేగింపు, నిమజ్జనం ఏర్పాట్లు, తీసుకోవలసిన జాగ్రత్తలపై చర్చించడం జరుగుతుందన్నారు.

సర్వాయి పాపన్న గౌడు జయంతి

బనగానపల్లె రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని ఫోర్‌లైన్స్ రోడ్డుపై ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్న గౌడు జయంతిని ఈడిగ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం నాయకులు వెంకటేశ్వర్లు గౌడు, మోహన్‌గౌడు ఆయన సేవలను కొనియాడారు.

అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

డోన్ టౌన్: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని అధ్యాపకుల ఐక్య కార్యాచరణ సమితి ప్రతినిధులు, ప్రభుత్వ కళాశాల టీచర్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి లక్ష్మయ్య, నాయకులు కోరారు. సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు చేపట్టి ప్రిన్సిపాల్ భారతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలు మార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేదన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

ప్యాపిలి: మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ మధుసూధన్ హెచ్చరించారు. స్థానిక బనగానపల్లె క్రాస్ రోడ్డు వద్ద సోమవారం ఆయన వాహనాల తనిఖీ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడిపితే ప్రమాదాల బారిన పడతారన్నారు. అలాగే అతివేగంతో, హెల్మెట్, సీటు బెల్టు లేకుండా వాహనాలు నడపరాదన్నారు. అనంతరం రికార్డులు సక్రమంగా లేని పలు వాహన చోదకులకు జరిమానా విధించారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి

డోన్ టౌన్: నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో మూడు కార్ల పంటలు పండే 8 వేల ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఇండోసోల్ కంపెనీకి అప్పగించేందుకు రైతుల నుంచి బలవంతంగా భూసేకరణ చేస్తోందని సీపీఎం నేతలు మండిపడ్డారు. స్థానిక కార్యాలయంలో వారు సోమవారం మాట్లాడుతూ బలవంతపు భూసేకరణ ఆపాలని, లేకుంటే పోరాటాలు చేస్తామని సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా సభ్యులు చిన్న రహిమాన్ స్పష్టం చేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్ర బోతుల పాపిరెడ్డి

సంజామల: మండలంలోని గిద్దలూరు గ్రామంలో సీతారామంజనేయ స్వామి ఆలయంలో మూడు రోజులపాటు సీతారామలక్ష్మణ,ఆంజనేయ జీర్ణోద్ధరణ, ధ్వజ, శిఖర కలశ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. చివరి రోజు సోమవారం ఆలయంలో స్వామివార్లకు యంత్ర ప్రతిష్ఠాపన, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, శిఖరకలశ ప్రతిష్ఠ, గోదర్శన, బలిదానం, మహాపూర్ణాహుతి, మహామంగళ హారతితో పాటు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం సూర్య ప్రకాశ్ రెడ్డి, వైస్సార్‌సీపీ గిద్దలూరు నాయకుడు బత్తుల రామచంద్రారెడ్డి, విజయ డెయిరీ డైరెక్టర్ చెన్నరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి విగ్రహ ప్రతిష్ఠ



కొలిమిగుండ్ల: అబ్దులాపురం ఉన్నత పాఠశాలలో సోమవారం సరస్వతి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గతంలో పాఠశాలలో పని చేసిన వేనుమాధవ్ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు విగ్రహ ప్రతిష్ఠ గావించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. హెచ్ఎం వెంకటేశ్వర్‌రెడ్డి ఎంఈఓ అబ్దుల్‌కలాం, రాజయ్య, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడి విగ్రహం ఊరేగింపు



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ప్యాపిలి: మండల పరిధిలోని హుసేనాపురం గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఈ నెల 16న శ్రీకృష్ణాష్టమి సందర్భంగా గ్రామంలో శ్రీకృష్ణుడి ప్రతిమను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముగింపు వేడుకల్లో భాగంగా శ్రీకృష్ణుడి ప్రతిమకు గ్రామోత్సవం నిర్వహించారు. నిర్వాహకులు శివప్రసాద్, సుధాకర్ నాయుడు, మల్లికార్జున, మధు, గోపాల్, పరమేశ్, ప్రజలు అధిక సంఖ్యలో పలకీ సేవలో పాల్గొన్నారు.

ఉమామహేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం ఆలయ ఈఓ పాండురంగారెడ్డి, అర్చకుల ఆధ్వర్యంలో ఆలయంలో ఏకశిలా రూపంలో కొలువైన శ్రీ ఉమామహేశ్వరస్వామికి అభిషేకం, అర్చన తదితర పూజలు చేపట్టారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వేలంలో ఆలయానికి ఆదాయం



నందవరంలో వేలం నిర్వహిస్తున్న ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ ఆవరణలో పలు వ్యాపార హక్కులు పొందుటకు నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా ఆలయానికి రూ.14.62 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. ఇందులో టెంకాయల బహిరంగ వేలం ప్రొద్దుటూరుకు చెందిన పుల్లయ్య రూ.40,40,000, కిరాణం దుకాణం పి.హర్షవర్ధన్ రూ.7,65,000, హోటల్ గుద్దేటి లక్ష్మిప్రసన్న రూ.2,81,000, కూల్‌డ్రింక్ దుకాణాన్ని గండికోట ప్రేమశేఖర్ 3,43,000కు పాడి దక్కించుకున్నారని చెప్పారు. గతేడాది పాటల కంటే రూ.14.62 లక్షల ఆదాయం సమకూరిందని వివరించారు. గ్రూప్ ఆలయాల ఈఓ బ్రహ్మానంద రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

హిందూ సంస్కృతిని పరిరక్షించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

డోన్ టౌన్: ప్రతి భారతీయుడు హిందూ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలని విశ్వహిందూ పరిషత్ ఉత్తరాంధ్ర, దక్షిణాంధ్ర ప్రాంత సంఘటన మంత్రి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక పాతపేట రాముల దేవాలయంలో సోమవారం జరిగిన విశ్వ హిందూ పరిషత్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో హిందుత్వంపై విదేశీ సంస్కృతి దాడులు అధికమయ్యాయని వాటిని తిప్పికొట్టాలని సూచించారు. హిందూ సమాజం ఉనికికి ప్రమాదం ఉందని దీన్ని ఉమ్మడి కుటుంబ వ్యవస్థ సంకల్పంతో ఎదుర్కోవాలన్నారు. బజరంగదళ్ ప్రముఖ్ తిమ్మారెడ్డి, విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, డోన్ ప్రముఖులు శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెపిల్లలకు ముర్రుపాలు శ్రేష్టమైనవి



మాట్లాడుతున్న డాక్టర్ నాగరాజు

డోన్: పుట్టిన గంట లోపు గొర్రె పిల్లలకు ముర్రుపాలు తాపించడమే గాక 24 గంట ల్లోపు ధనుర్వాతం టీకాలు వేయించాలని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ నాగరాజు సూచించారు. గొర్రెపిల్లల పెంపకం – సంరక్షణపై మండలంలోని గోసానిపల్లె, తిమ్మాపురం గ్రామాలలో పెంపకందారులకు అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొర్రెపిల్లలకు తల్లి నుంచి పాలు అందని పక్షంలో పాలపొడి ప్యాకెట్లు వాడాలని సూచించారు. రోజుకు 50 గ్రాముల పాల పొడిని కలిపి ద్రావణం తాపాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఐదుగురు గొర్రెల పెంపకందారులకు 2 కేజీల చొప్పున పాలపొడి ప్యాకెట్లను అందజేశారు. కృషి విజ్ఞాన కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ గౌసియాబేగం, శాస్త్రవేత్త రోజా, పశుసంవర్థక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ నాగరాజు, పశువైద్యాధికారి డాక్టర్ పద్మావతితో పాటు గొర్రెల పెంపకందారులు పాల్గొన్నారు.